ప్రజాశక్తి

బుధవారం 27 నవంబర్ 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



విజయవాడలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న రైతు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు



విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన కొమ్మారెడ్డి కేశవరెడ్డి స్మారక స్టూడియోను ప్రారంభిస్తున్న ఆలిండియా లాయర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్

సోషల్ మీడియా ద్వారా ప్రజలను ప్రగతిశీల భావాల వైపు నడిపించాలి

కేశవరెడ్డి స్మారక స్టూడియో ప్రారంభంలో వక్తలు

వార్త మెయిన్‌లో

నిరసన గళం

- కేంద్ర ప్రభుత్వ విధానాలపై గొంతెత్తిన రైతు, కార్మిక లోకం
- విజయవాడలో భారీ ప్రదర్శన, సభ
- ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు



బందరులో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన దేశవ్యాప్త నిరసనలో భాగంగా కార్మికులు, కర్షకులు తమ నిరసన గళం వినిపించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని నినాదాలు చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని బస్టాండ్ సెంటర్ నుండి కోనేరు సెంటర్ వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి కార్మికులకు, రైతులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకొస్తూ అణిచివేత ధోరణి అవలంభిస్తోందని మండిపడ్డారు. అలాగే నందిగామ, తిరువూరుల్లో ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. విజయవాడలో తుమ్మలపల్లి కళా క్షేత్రం నుంచి పిడబ్ల్యూడి గ్రౌండ్స్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రైతులు, కార్మికులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఎర్రజెండాలు చేతబూని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిఎం ప్రధాని, రాష్ట్రపతిలకు పంపేందుకు హెచ్చరిక నోటీసులను కలెక్టర్ లక్ష్మీశాకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

... వార్తలు మెయిన్, జిల్లా పేజీల్లో

పరాధీనం..?

- బందరు కార్పొరేషన్ స్థలాలు ప్రైవేటు చేతికి
- పిపిపి పద్ధతిలో నిర్మాణాలకు ప్రతిపాదనలు



మూతబడిన బేబి కేర్ సెంటర్

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మచిలీపట్నం నగరపాలక సంస్థ ఆధీనంలోని విస్తారమైన స్థలాల్లో ప్రయివేటు భాగస్వామ్యంతో భవన నిర్మాణాలకు సమగ్ర ప్రణాళిక (డిపిఆర్)లు రూపొందుతున్నాయి. ఈ క్రమంలో అభివృద్ధి పేరుతో విలువైన స్థలాలను ప్రభుత్వం పరాధీనం చేస్తోందనే చర్చ నగరంలో జోరందుకుంది.

మచిలీపట్నం బస్టాండ్ సెంటర్‌కు ఎదురుగా బ్రిటీష్ పాలనాకాలంలోనే కింగ్ ఎడ్వర్డు మెమోరియల్ మెటర్నిటీ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ (బేబీ కేర్ సెంటర్)ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ మూతపడిన తర్వాత షెల్టర్ ఫర్ హోమ్‌లెస్ (ఎస్‌యుహెచ్)ను నిర్వహించారు. ఈ ప్రాంగణం చుట్టూ 25 షాపులతో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఈ షాపుల ద్వారా ప్రతి నెలా రూ.లక్ష వరకు మున్సిపాల్టీకి ఆదాయం వస్తోంది. బేబీకేర్ సెంటర్, పాతపడిన షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించి ఆధునిక వాణిజ్య సముదాయాన్ని ప్రయివేటు భాగస్వామ్యం(పిపిపి)లో నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికి సమీపంలోని పురాతన భవనం ఇటీవల గజం రూ.లక్షకు అమ్మకాలు జరిగాయి. ఈ క్రమంలో బేబీకేర్ సెంటర్ స్థలం విలువ రూ.25 కోట్లు వరకు ఉంటుందని (మిగతా 2లో)

'తూర్పు'లో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ తూర్పు నియోజకవర్గంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. రాణిగారితోటలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం తూర్పు నగర కమిటీ 23వ మహాసభ తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలు తదితర అంశాలను ఆయన వివరించారు. మహాసభలో చేసిన తీర్మానాలకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి ప్రజలను కదిలించి ఉద్యమిస్తామన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని, ఎన్నికల వాగ్దానాలుగానే మిగిలిపోతున్నాయని విమర్శించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో కృష్ణలంక 22, 21 డివిజన్ల పరిధిలోని భ్రమరాంబపురం, హరినాథపురం, ఇందిరాకాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్య దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు. దీని వల్ల ఉన్న ఆస్తిని వినియోగించుకొని దానిపై రుణం తీసుకొని పిల్లల చదువులు, పెళ్లిళ్ల తదితర అవసరాలకు ఉపయోగపడే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ ప్రాంత ఇళ్లకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కృష్ణలంకలోని 20, 21, డివిజన్లతో పాటు 16, 17, 18 డివిజన్ల పరిధిలోని రిటైనింగ్ వాల్ నిర్మాణంలోని లోపాలను సరి చేసి, పటిష్ట పరిచి, వరద ముంపు నివారణా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేగాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఈ డివిజన్ల పరిధిలోని కృష్ణాకరకట్ట ప్రాంత ఇళ్లకు శాశ్వత ప్రాతిపదికన పట్టాలు ఇవ్వాలని కోరారు. మొగల్రాజపురంలో 1/1 ఎ సమస్యను పరిష్కరించి, ఈ ప్రాంత ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని అనేక ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. అంతేగాక కొండ ప్రాంతంలో మెట్లు, మంచినీరు, డ్రెయినేజీ సమస్యను పరిష్కరించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కొండ చరియలు విరిగిపడి సంభవిస్తున్న మరణాలను, ఆస్తి నష్టం నివారణకు కొండల చుట్టూ రక్షణ గోడ నిర్మించాలన్నారు. కృష్ణలంక 21వ డివిజన్ నుంచి రామలింగేశ్వర్‌నగర్ వరకు కృష్ణానది ఒడ్డు ప్రాంతంగా ఉన్న ఇళ్లకు రివర్ కన్సర్వేటివ్ యాక్ట్, జిఓ నెంబర్ 119 ప్రకారం బిల్డింగ్ ప్లాన్‌లు ఇవ్వడం లేదని, నదికి దూరంగా ఉన్న ఇళ్లకు ప్లాన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాణిగారితోట హైవేపై సబ్‌వే నిర్మాణం చేపట్టనందున మూడు డివిజన్ల పరిధిలోని 15 వేల కుటుంబాలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ప్రజలకు భారమైన ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేసి, స్మార్ట్ మీటర్లను పెట్టవద్దని పేర్కొన్నారు. సిపిఎం తూర్పు నగర కమిటీ కార్యదర్శి పి.కృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అంబేద్కర్ నగర్‌లో నిర్మాణం పూర్తయిన మంచినీటి ట్యాంక్‌ను ప్రారంభించి, మంచినీటి సమస్యను పరిష్కరించాలన్నారు. పైపులైన్లు, డ్రెయినేజీ కోసం తవ్వి వదిలేసిన రోడ్లను పునర్నిర్మించి, డ్రెయినేజి వ్యవస్థను బాగు చేయాలన్నారు. సత్యంగారి హోటల్ సెంటర్‌లో ఇళ్ల మధ్యలో ప్రారంభించిన మద్యం షాపును తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తూర్పు నగర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, టి చంద్రశేఖర్, కోరాడ రమణ, జి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్, తూర్పు నగర కార్యదర్శి కృష్ణ

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్

విజయవాడ: బిజెపి పాలనలో రాజ్యాంగం తీవ్ర ప్రమాదంలో పడిందని, ప్రగతిశీల, ప్రజాస్వామ్యవాదులు, లౌకిక పార్టీలు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ద్వారా దేశ సమగ్రతను కాపాడుకోవాల్సి ఉందని మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్ అన్నారు.



75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహా న్యాయ శిల్పం వద్ద దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప అధ్యక్షతన మంగళవారం భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ రాజ్యాంగ విచ్ఛిన్నానికి బిజెపి ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. సెక్యులర్, సోషలిస్టు పదాలు సైతం రాజ్యాంగంలో లేకుండా చేయడానికి కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రయోజనాలు పొందడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించార. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావు, అప్సర్, ఆజం, పేరయ్య, ఆనందరావు, రాము, కృష్ణ పాల్గొన్నారు.

మ్యూజిక్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయవాడ: దుర్గా ఘాట్‌లో జరిగే కృష్ణవేణి సంగీత నీరాజనం మ్యూజిక్ ఫెస్టివల్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక శాఖ సౌజన్యంతో కృష్ణవేణి సంగీత నీరాజనం మ్యూజిక్ ఫెస్టివల్ ను వచ్చే నెల 6వ తేదీ నుంచి 8 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో నగర కమిషనర్ మంగళవారం దుర్గా ఘాట్‌ను సందర్శించారు. నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని విఎంసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్-1 జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఇన్చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



దస్త్రాల పరిష్కారంలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి-విజయవాడ: దస్త్రాల పరిష్కారంలో అలసత్వానికి తావు లేకుండా, నిబద్ధతతో, జవాబుదారీతనంతో సేవలందించాలని ముఖ్యంగా ప్రజాప్రయోజనాలతో ముడిపడిన దస్త్రాలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహంతో కలిసి కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రజా సంక్షేమం, అభివద్ధికి సంబంధించిన దస్త్రాలను సత్వరం పరిష్కరించాలని అలసత్వానికి తావులేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. ఫైళ్ల పరిష్కారంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దష్టికి తీసుకురావాలని.. తన పరిధిలోని అంశాలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని.. ఒకవేళ ఏవైనా అంశాలను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాల్సి ఉంటే వెంటనే ఆ పని చేయనున్నట్లు వివరించారు.



లింగ వివక్షపై పోరాడాలి

ప్రజాశక్తి-విజయవాడ: మహిళలపై హింసను నివారించేందుకు, లింగ వివక్షను రూపుమాపేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించడానికి సేఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఆర్‌కె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సదస్సు నిర వ్హించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేమూరి సత్యవతి మాట్లాడుతూ మహిళలపై భౌతిక దాడులు, కుటుంబాల్లోని లింగ వివక్షల గురించి చర్చించారు. సమాజంలో మార్పు రావాలంటే, ఇంటి వద్దే పిల్లలకు సమానత్వం గురించి నేర్పించాలన్నారు. నేరాలు నివారించడానికి 112 , 1098 వంటి హెల్ప్‌లైన్ల గురించి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కె.స్వరూపరాణి మాట్లాడుతూ 75 ఏళ్ల రాజ్యాంగ పాలన అనంతరం కూడా మహిళలు సమాజంలో సమానత్వాన్ని పొందడంలో ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉషా రాజు, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

పనుల నాణ్యతలో రాజీ పడొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

పంచాయతీరాజ్, ఉపాధి హామీ, జలజీవన్ మిషన్, అంగనవాడి టాయిలెట్స్ పనులు వేగవంతం చేయాలని, పనుల నాణ్యత పట్ల రాజీ పడవద్దని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మీకోసం హాల్లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, డ్వామా, ఆర్డబ్ల్యూఎస్, తదితర శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి ఆయా శాఖల ద్వారా జరుగుతున్న అభివద్ధి పనులు నియోజకవర్గ,మండల వారి సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్, ఉపాధి హామీ, సిఎస్ఆర్ పథకాల కింద చేపట్టే పనులకు నిధుల కొరత లేదన్నారు. గత వారానికి జరిగిన పనుల పురోగతి కలెక్టర్ సమీక్షిస్తూ నూరు శాతం గ్రౌండింగ్ జరగాలన్నారు.

మొదటిపేజీ తరువాయి

పరాధీనం..?

అంచనా. దేశాయ్‌పేటలోని 13 ఎకరాల్లో స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. ఎకరం మూడు కోట్ల విలువైన ఈ భూముల్లో ప్రయివేటు భాగస్వామ్యంతోనే స్టేడియం ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఎకరం మూడు కోట్ల చొప్పున ఈ భూమి విలువ రూ. 39 కోట్లు ఉంటుందని అంచనా. రూ.3 కోట్ల విలువైన రైలుపేటలోని ట్రావెలర్స్ బంగ్లాను పిపిపిలో ఆధునీకరించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పిపిపిలో కార్పొరేషన్‌కు సమకూరే ఆదాయంకన్నా ప్రయివేటు భాగస్వామికి దక్కే ప్రతిఫలం ఎక్కువగా ఉంటుందనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఒకసారి ప్రయివేటు భాగస్వామి చేతికి వెళ్లిన స్థలాలు గడువు ముగిసిన తర్వాత తిరిగి కార్పొరేషన్ స్వాధీనం చేసుకోవడంపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రెండు పార్టీలదీ ఒకే తీరు

గత వైసిపి పాలనలో కోర్టు రోడ్డులోని పోలీస్ స్థలాన్ని వైసిపి కార్యాలయానికి కేటాయించారు. దేశాయ్‌పేటలోని మరో ఎకరం స్థలాన్ని ప్రయివేటు భాగస్వామ్యంతో ఆసుపత్రి నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థ (ఎపిఐఐసి) కేటాయించారు. తాజాగా ఈ ప్రయివేటీకరణ వేగం పుంజుకుంది. కార్పొరేషన్‌లోని విలువైన స్థలాలన్నీ పరాధీనం అయ్యే పరిస్థితి నెలకొంది.

ప్రజలకు మెరుగైన సేవల్లో ఉద్యోగుల పాత్ర కీలకం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని జిల్లా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో ప్రజలకు పారదర్శకమైన సేవలందించి అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశను ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యకులు ఎ.విద్యాసాగర్ ఆధ్వర్యంలో జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు మంగళవారం కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమానికి, అబివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడంలో అధికారులు ఉద్యోగుల కృషి ఎంతో అవసరమన్నారు.ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో పనిచేసే ఉద్యోగులు ప్రజలకు సేవలందించడంలో ఎల్లప్పుడు ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణ రెడ్డి, పి.రమేష్, బి.సతీష్ కుమార్, బీవీ రమణ, నాగేంద్ర రావు, నగర అధ్యక్షులు సివిఆర్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఎస్ కె.నజీరుద్దీన్, వేమూరి ప్రసాద్, శివ శంకర్, శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యకులు ఎస్‌కె జానీబాషా పాల్గొన్నారు.

ధాన్యం అమ్ముడుపోక రైతులు విలవిల

- వల్లూరుపాలెంలో ఒకేచోట 500 ఎకరాల ధాన్యం రాశులు
- 15 రోజులుగా కొనుగోళ్లు లేవు
- వాయుగుండం ప్రభావంతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని వల్లూరుపాలెం గ్రామంలో కష్ణా నది పాయవడ్డున రైతన్నలు ఆరు కాలం పండించిన ధాన్యం పంట అమ్ముడు పోక విలవిలలాడుతున్నారు. బద్రిరాజుపాలెం, వల్లూరుపాలెం, పాములలంక, కాలాసుమాలపల్లె, రొయ్యూరు గ్రామాల్లో ధాన్యం పంట పండించిన రైతులు కష్ణ నది పాయవొడ్డుకు తెచ్చి ఆరబెట్టుకున్నారు. 500 ఎకరాలకు పైగా ధాన్యం రాశులను ఆరబెట్టుకుని రైతులు దీనంగా కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్ బి కే కేంద్రాల వద్దకు వెళితే అధికారులు మాకు సంబంధం లేదని మిల్లర్ల వద్దకు వెళ్లి అమ్ముకోవాలని చెబుతున్నారు. వ్యవసాయ అధికారులు కనీసం తమ గోడు వినిపించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. 1262 రకం దాన్యం సాగుచేశామని, ఈదాన్యాన్ని కొనడానికి మిల్లర్లు ముందుకు రావడం లేదని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1740 కు కొనకుండా రూ.1200 కు అడుగుతున్నారని, రైతు శ్రమను దోచుకోవడానికి చూస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. 15 రోజుల నుంచి ధాన్యాన్ని ఆరబెట్టుతున్నామని తేమ శాతం 16 నుంచి 17 వరకు ఉన్నప్పటికీ మిల్లర్లు, ఆర్బీకే అధికారులు తమ ధాన్యాన్ని కొనడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోపక్క వాయుగుండం ప్రభావంతో రైతు గుండెల్లో వణుకు పడుతుందని అంటున్నారు. వాతావరణ అనుకూలత సాగుగా చూపించి మిల్లర్లు తక్కువ ధరకు ధాన్యాన్ని అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతుల గోడు విని తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



ధాన్యం చూపిస్తున్న రైతులు

తల్లిదండ్రులకు పిల్లలు అప్పగింత

ప్రజాశక్తి-కంకిపాడు : ఇంటి నుంచి పారిపోయి వచ్చిన ఇద్దరు బాలురను శక్తి టీం కానిస్టేబుల్ సురక్షిం తంగా వారి తల్లిదండ్రులకు అప్పగిం చిన ఘటన కంకిపాడులో మంగళవారం జరిగింది. శక్తి టీం నంబర్ కానిస్టేబుల్ కంకిపాడు బస్టాండ్ లో విధులు నిర్వహిస్తున్న సమయంలో బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా ఇద్దరు పిల్లలు కూర్చుని ఉండడాన్ని గమనించి, వెంటనే వారిని కంకిపాడు పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు. ఆ పిల్లలను విచారించగా, మాట వినడం లేదని తల్లిదండ్రులు మందలించినందుకు ఇంటి నుండి పారిపోయి వచ్చామని, మాది మానికొండ గ్రామమని తెలిపారు. .వారి తల్లిదండ్రుల వివరాలు సేకరించి, వారి తల్లిదండ్రులను స్టేషన్కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి వారి పిల్లలను సురక్షితంగా వారికి అప్పగించారు.



నేత్రదానం

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని ఎలుకపాడు గ్రామా నికి చెందిన అజ్మీర వెంకటేశ్వరరావు, అజ్మీర గోపీల కుమార్తె త్రివేణి (18) మృతి చెందగా కుటుంబ సభ్యులు కళ్ళను దానం చేయాలని భావించి ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్యశాలకు సమాచారం అందించగా వారు త్రివేణి నేత్రాలను సేకరించారు. అనంతరం వారి సంస్థ నుండి నేత్రాలు స్వీకరించినట్లు పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

నాంచారయ్యకు అవార్డు అందజేత

ప్రజాశక్తి-ఉయ్యూరు : కడవకొల్లుకు చెందిన ప్రముఖ నాటక రంగ కళాకారుడు ఎర్రపోతు వెంకట నాంచార య్య నాయుడుకు అభిలాష హెల్పింగ్ హేండ్స్ ఆర్గనైజేషన్ నుండి ఎంఎస్ నారాయణ ఎక్స్ లెన్సీ -2024 అవార్డు అందుకున్నారు. ఏపిజే అబ్దుల్ కలాం 93వ జయంతి, సర్దార్ వల్లభ బాయ్ పటేల్ 149వ జయంతి పురస్కారాల సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో అభిలాష హెల్పింగ్ హేండ్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటుచేసిన కార్యక్ర మంలో ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఎస్.సరోజనమ్మ తదితరుల నుండి వెంకట నాంచారయ్య నాయుడు అవార్డు అందుకున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : లయన్ డాక్టర్ కామినేని అచ్యుతబాబు ఆర్థిక వితరణతో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. మండలంలోని పెంజెంద్ర హై స్కూల్లో 80 మంది విద్యార్థులకు, డోకిపర్రు ప్రభుత్వ పాఠశాలో 150 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిమ్మగడ్డ శశికళ,సభ్యులు వైపీసీ ప్రసాద్ (ఫాస్ట్ గవర్నర్) లయన్ బొప్పన శివప్రసాద్, వీరమాచనేని శివప్రసాద్, మాజీ ఎంపీటీసీ నాగ లక్ష్మి , ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లల సంరక్షణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని పిల్లల సంరక్షణ సంస్థల్లో (చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్) రక్షణ పొందుతున్న పిల్లలందరినీ జువైనల్ జస్టిస్ చట్టం పరిధిలోకి తప్పనిసరిగా తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా మహిళాభివద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో అనాథ పిల్లల సమస్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనాథ పిల్లలను, పిల్లల సంక్షేమ కమిటీ (సి డబ్ల్యూ సి) ద్వారా లీగల్లీ ఫ్రీ ఫర్ అడాప్షన్ సర్టిఫికెట్ మంజూరు చేసి కారా వెబ్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని, తద్వారా పిల్లలను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చే వారి సౌకర్యార్థం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను గుర్తించి వారికి ఆధార కార్డులు, ఆర్ఫన్(అనాథ) సర్టిఫికెట్ల జారీకి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ ఎస్ సువర్ణ, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ సత్యవతి, డీసీపీవో మోనిష పాల్గొన్నారు.



ఉపాధి కల్పన కోసమే జాబ్‌మేళాలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ,జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్‌డిఎ - సీడాప్ సంయుక్త అద్వర్యంలో మంగళవారం మచిలీపట్నం మండలంలోని పోతేపల్లిలో గల మచిలీపట్టణం ఇమిటేషన్ జ్యువలరీ పార్క్ మెంబెర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు మరియు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి డా. పి నరేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఈ మేళా లో విజేతా గోల్డ్ కవరింగ్స్ వర్క్స్, రవి ఇంజెక్షన్ మౌల్డింగ్ వర్క్స్ మరియు మెడ్ ప్లస్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారని వారు తెలిపారు. మొత్తంగా 27 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 09 ఎంపిక కాగా, మరొక ఆరుగురు తదుపరి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని తెలిపారు.ఈ కార్యక్రమంలో,హెచ్ అర్ ప్రతినిధులు, నైపుణ్యాభివద్ధి సంస్థ జిల్లా నియామకాధికారి తుర్లపాటి మధు, యంగ్ ప్రొఫెషనల్ ఎస్ జయ రాజు, ఏ పి ఎస్ ఎస్ డి సి సంస్థ సిబ్బంది రాహుల్, సి హెచ్ రాజేష్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కె దిలీప్, మరియు సీడాప్ సంస్థ సిబ్బంది రజిత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : బంగాళా ఖాతంలో వాయు గుండం ప్రభావంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నందున ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు మండలాల తహసీల్దారులు దారుణం కొనుగోళ్లపై శ్రద్ధ వహించాలని సూచించారుజ ప్రధానంగా వరి కోత యంత్రాలతో కోసి గ్రామాల్లో ఆరబెట్టి ఉన్న ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు నిర్వహిస్తున్న పిఎసిఎస్ రైతు సేవా కేంద్రాల సిబ్బంది ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు రైతులకు సహకరిస్తూ కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని 31 వ డివిజన్ శారదనగర్‌లో మంగళవారం శారదానగర్ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మచిలీపట్నం సర్వజన ప్రభుత్వ వైద్యశాల కంటి వైద్య నిపుణులు డాక్టర్. జి భానుమూర్తి పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రజలు వంద మందికి పైగా పాల్గొని పరీక్షలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా డా.జి భానుమూర్తి మాట్లాడుతూ పరీక్షలు చేసుకున్న వారిలో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని 25 మందికి కళ్లజోళ్లు పడతాయని,వాటిని ఎన్టీఆర్ వైద్య సేవ కింద ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉడుముల బుజ్జి,మట్టా జయప్రకాష్, బీడెల్లి మరియా కుమార్ ,కె చిట్టిబాబు,గణేష్, జూనపూడి పధ్వీ , నలకుర్తి అశోక్ , చికుర్తి కోటయ్య , చాట్రగడ్డ మనోజ్ ,అర్. ప్రవీణ్, కత్తి సుధీర్, మట్ట జయ ప్రకాష్, పోతార్లంక హనోక్, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యాశాఖ ఆదేశాల మేరకు కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన అంతర్జాల నేరాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సబ్ ఇన్స్పెక్టర్ కే శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాల మీద సామాజిక మాధ్యమాల దుర్వినియోగం కు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. వాటి వల్ల సామాన్య పౌరులు విద్యావంతులు ఏ విధంగా నష్టపోతున్నారో తెలియజేశారు. నేరాలు జరిగినప్పుడు సత్వరమే స్పందించాలని, కనీసం 1930 నెంబర్ కు వివరాలు తెలియజేయాలన్నారు. అనంతరం కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చల్లపల్లి మండలం సచివా లయం మహిళా పోలీసులు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్‌లను అవనిగడ్డలోని వారి కార్యాలయం వద్ద మంగళవారం విడివిడిగా కలసి వినతిపత్రాలు అందజేశారు. వారి సమస్యలపై ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

జిల్లా పరిషత్ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలోనిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సర్వ శిక్ష అభియాన్ కష్ణాజిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రామలాల్ నాయక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. అదే విధంగా పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐటీ ఎలక్ట్రానిక్స్ పరికరాలను పరిశీలించి సంబంధికులకు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పంశీలించి విద్యార్థులందరూ భోజనాన్ని తినేలా చూడాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రావుకు సూచించారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-గూడూరు : మండలంలోని గూడూరు మెయిన్ రోడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం గూడూరు ఆర్బికే కేంద్రాన్ని సందర్శించారు. రైతుల నుంచి సమస్యలు తెలుసుకుని ధాన్యం అమ్ముకునే రైతులకు రైస్ మిల్లర్స్ నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సహకరించి సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ డి రాజ్యలక్ష్మికి సూచించారు. గూడూరులో రామలింగేశ్వర స్వామి దేవస్థానం (శివాలయం) నందు ఏర్పాటుచేసిన కార్తీక వన సమారధనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులకు భోజనాలను కాగిత కష్ణ ప్రసాద్ వడ్డించారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, గోపి నాగబాబు, ఎన్ ఏ బేగ్, రాసంశెట్టి దుర్గారావు, బాసం శెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్య వాగుపై వంతెనకు మోక్షమెప్పుడో !

- రెండు దశాబ్దాలుగా పాలకుల హామీలు
- ఇంకా ప్రారంభం కాని పనులు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల నుండి చెవిటికల్లు వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డుపై చెవిటికల్లు ఊరు ముందు లక్ష్మయ్య వాగుపై వంతెన నిర్మాణం ఎప్పుడు అని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఈ వాగుపై వంతెన నిర్మాణానికి పాలకులు ఇస్తున్న హామీలు నీటిమూటలుగానే ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వర్షాకాలంలో వచ్చిన వరదలకు వాగు పొంగి రోడ్డుపై ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలగటమేకాక ప్రమాదవశాత్తు వరదలో వాగు దాటుతూ ఏటా ఒకరిద్దరు మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందే. వరదలు వచ్చి వాగుపొంగి, వాగుదాటుతూ అమాయకులు మృతి చెందినప్పుడు, మంత్రులు, ఎంఎల్ఎలు హడావుడి చేసి తక్షణమే వాగుపై వంతెన నిర్మిస్తామని ఊకదంపుడు హామీలు ఇస్తూనే ఉన్నారు. 2009 నుండి 2024 వరకు ఈ వాగుదాటుతూ ప్రమాదవశాత్తు పలువురు మృతి చెందగా, ఇప్పటివరకు అరడజను మంది మంత్రులు వచ్చి వంతెన నిర్మిస్తామని హామీలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అయినా నేటికీ వంతెన నిర్మాణం అడుగు ముందుకు పడలేదు. ప్రతిఏటా బారీ వర్షం కురిసిన లేదా కష్ణా నదికి మూడు లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరిన లక్ష్మయ్య వాగుకు వరద నీరు వచ్చి కంచికచర్లకు, చెవిటికల్లు, కునికనపాడు, మున్నలూరులకు ఈ రోడ్డుపై మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోతాయి.

గత ఎంఎల్ఎ మొండితోక జగన్‌మోహన్‌రావు లక్ష్మయ్య వాగుపై వంతెన నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎట్టకేలకు వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 1.24 కోట్లు మంజూరు చేయగా టెండర్లు కూడా పిలిచారు. హడావుడిగా శంకుస్థాపన చేశారు. వంతెన


వరదల సమయంలో లక్ష్మయ్య వాగు పరిస్థితి (ఫైల్)

నిర్మాణం పొడవు, వెడల్పు విషయంలో పాలకులు ఒక అంచనాకు రాకపోవటంతో పాటు, బిల్లులు వస్తాయో రావో అని గుత్తేదారుడు నిర్మాణపనులు చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్లో కృష్ణా నదికి వచ్చిన వరద వల్ల లక్ష్మయ్య వాగు పొంగి గ్రామంలోకి వరద చేరి గ్రామంలోకి వారం రోజులు పాటు వెళ్ళనీయలేదు. దీంతో గ్రామ కాపురస్తులు డాబాలపై కాపురాలు పెట్టి కాలం గడిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం వెంటనే ప్రభుత్వం లక్ష్మయ్య వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

నూరు శాతం అక్షరాస్యత సాధించాలి


శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాస్యత (వయోజన విద్య) ప్రోగ్రాంపై మండల స్థాయిలో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం వెలుగు ఎపిఎం బొలగాని రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.కె.వెంకట రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 నాటికి 100శాతం అక్షరాస్యత సాధించాలని, దీనిలో భాగంగా మహిళలకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, క్రీయాత్మక అక్షరాస్యత మహిళలకు ఈ వందరోజుల కార్యక్రమంలో నేర్పుతామని, శిక్షణ పూర్తయిన తర్వాత పరీక్షలు నిర్వహించి వారికి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు వాలంటీర్ టీచర్స్ కూడా జిల్లా కలెక్టర్‌చే సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈఓపిఆర్డీ ప్రభాకర్ , సీసీ లు ఎం .మణి, ఎస్.సుందరమ్మ, వి. రత్నావలి, సిబ్బంది రమాదేవి, సురేశ్, అన్ని గ్రామాల విఓఎ లు తదితరులు పాల్గొనటం జరిగింది అని బొలగాని రామకష్ణ తెలిజేయడం జరిగింది.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - నందిగామ : ఇసుక లారీ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. చందర్లపాడు మండలం కాసరబాద ఇసుక రీచ్ నుంచి నందిగామ వైపు ఇసుక లోడుతో వస్తున్న లారీ టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో కాసరబాదకు చెందిన నంద్యాలరామిరెడ్డి (46) రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో కాలు విరిగింది. క్షతగాత్రుడిని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇసుక రీచ్ నిలిపివేయాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజ్‌కుమార్ అంత్యక్రియలు


రాజ్‌కుమార్ అంతిమయాత్ర దృశ్యం

ప్రజాశక్తి - భవానీపురం : ప్రముఖ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ద్వితీయ కుమారుడు డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ అంతిమయాత్ర బంధుమిత్రులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య మంగళవారం జరిగింది. ఈ నెల 24న డాక్టర్ రాజ్ కుమార్ మానసిక ఒత్తిడితో భవానీపురంలోని ఆయన స్వగృహంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఎంబిబిఎస్ పూర్తి అయిన తరువాత ఎంఎస్ చదువుతున్న రాజ్‌కుమార్‌కు ప్రజల్లో మంచి పేరు ఉంది. ఇటీవలి బుడమేరు వరదల సందర్భంగా కూడా రాజ్ కుమార్ వరదనీట మునిగిన ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు మంచినీరు, ఆహార పదార్థాలను అందజేసినట్లు కుటుంబీకులు తెలిపారు. డాక్టర్ రాజ్ కుమార్ మృతి వార్త తెలిసిన వెంటనే విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమా మహేశ్వరరావు, విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహనరావు, మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ పరామర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అయోధ్య రామిరెడ్డి తదితరులు ఫోన్ ద్వారా సానుభూతి తెలిపారు. రాజ్ కుమార్ అంత్యక్రియలు కష్ణలంకలోని స్వర్గపురిలో నిర్వహించారు.

ఈకార్ట్ సప్లై చైన్‌తో లాజిస్టిక్స్‌లో మార్పులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్: ప్రముఖ సప్లై చైన్ కంపెనీలలో ఒకటైన ఈకార్డ్, దాని అధునాతన సాంకేతికత కార్యాచరణ నైపుణ్యంతో లాజిస్టిక్స్ రంగాన్ని మారుస్తూనే ఉందని ఆ సంస్థ బిజినెస్ ఆఫీసర్ మణిభూషణ్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్ నందు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈకార్ట్ తమ కార్యకలాపాలను విస్తరిస్తోందని, దాని సరఫరా చైన్ ను మానిటైజ్ చేయడానికి దాని ప్రయత్నాలు గత మూడు సంవత్సరాలలో 8 రెట్ల వద్ధికి దారితీశాయన్నారు. బ్రాండ్లు రిటైలర్లు తమ సరఫరా గొలుసు అవసరాల కోసం ఈకార్డ్ యొక్క లాజిస్టిక్స్ సామర్థ్యాలను ఉపయోగించి వినియోగదారుల డిమాండ్ ను తీర్చడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. డెలివరీలలో 30 శాతం పెరుగుదలను, ఇకామర్స్ బ్రాండ్ల జోనల్ కవరేజీలో 40 శాతం విస్తరణను సాధ్యం చేశాయన్నారు.

జనావాసాల మధ్య మద్యం షాపు తొలగించాలి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విజయవాడ : జనావాసాలు, జనం రద్దీగా ఉండే సత్యంగారి హోటల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బ్రాందీషాపును తొలగించాలని, లేకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం తూర్పు నగర కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు హెచ్చరించారు. మద్యం మత్తులో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, అల్లర్లు పెరగడానికి మూల కారణ మవుతున్న బ్రాందీషాపును అక్కడి నుంచి తొలగించాలని కోరుతూ సిపిఎం 21, 21 డివిజన్‌లో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉండే కృష్ణలంకలోని 21,22 డివిజన్లలో ఈ మద్యం షాపు వల్ల అల్లర్లు, అఘాయిత్యాలు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 24 గంటల పాటు మద్యం విక్రయాలు జరుగుతూ...రాత్రి వేళల్లో మహిళల రాకపోకలకు అనేక ఇబ్బందులు ఉంటాయన్నారు. ఈ మద్యం షాపులను సత్వరమే తీసివేయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కోరాడ రమణ, నాయకులు టి.తాండవ కృష్ణ, కాయల లక్షణ, పి.శ్రీరాములు, ఎ.నాగరాజు, కొమ్మూరి ఆనంద్, విజ్జి అప్పారావు, గోక సూర్యనారాయణ, విజ్జి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


స్పీడ్ బ్రేకర్ల పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో వాహన వేగం నిరోధకాలు (స్పిడ్ బ్రేకర్స్) వేయించాలని స్థానికులు చేసిన ఫిర్యాదుపై కార్పొరేటర్ బోయి సత్యబాబు మున్సిపల్ కమిషనర్‌కి విన్నతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన అధికారులు పరిశీలించి మంగళరం గొల్లపాలెం గట్టు, మహంతి పురం ప్రాంతాల్లో వేగనిరోధక సీడ్ బ్రేకర్లు వేయించారు. ఎఇ శ్రీనివాసు, వర్స్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, స్థానిక పెద్దలు కె.లక్ష్మణ, బి.రవణ, బి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. **భవానీపురం :** స్థాని కొత్తపేటలో తమ్మిన పోతరాజు రోడ్డు నుండి గణపతిరావు రోడ్డుకు వెళ్ళు మార్గంలో నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతుండటం వలన కార్పొరేటర్లు మహదేవు అప్పాజీరావు, మరుపిళ్ళ రాజేష్ పశ్చిమ నియోజకవర్గం ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవతో డివైడర్ కటింగ్ చేయించారు. నెహ్రూ బొమ్మ సెంటర్ మలుపు వద్ద ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా మంగళవారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

మిథిలానగర్ ప్రహరీ కూల్చివేతపై వివాదం

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక విద్యాధరపురంలోని మిథిలానగర్ (రాజుగారి ప్లాట్లు) కు సంబంధించిన ప్రహరీ గోడను ప్రక్కనున్న ఖాళీ స్థలానికి చెందిన వ్యక్తులు కొంతమేర కూల్చివేయడంపై కాలనీ అసోసియేషన్ వారు కూల్చివేతకు పాల్పడ్డవారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మిథిలానగర్‌కు ఆనుకుని ఉన్న ఆర్ఎస్ నెంబర్ 18/1, 18/3 సర్వేనెంబర్లలో ఉన్న ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేశామంటున్న కె.సూరిబాబు, కబీర్ పాషా అనే వారికి చెందిన కొందరు వ్యక్తులు రెండు రోజుల క్రితం అర్ధరాత్రి మిథిలానగర్ వైపు ఉన్న 3,4 అడ్డరోడ్డులో నిర్మించబడిన ప్రహరీని రెండుచోట్ల కూల్చివేశారు. ఈ విషయం గమనించిన మిథిలా నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పరిమి మల్లేశ్వరరావు, అసోసియేషన్ కమిటీ సభ్యులు ఈ విషయమై పోలీసులకు సమాచారం అందజేశారు. ప్రహరీని తిరిగి కడతామని చెప్పి కాలయాపన చేస్తున్న సూరిబాబు తదితరులను ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం మిథిలానగర్ అసోసియేషన్ నాయకులు, స్థానిక నివాసితులు తమ కాలనీ ప్రహరీని అర్ధరాత్రి వేళ కూల్చివేసిన సంఘటనపై సూరిబాబు, అతని మద్దతుదారులను అసోసియేషన్ సభ్యులు గట్టిగా ప్రశ్నించారు. దీంతో సూరిబాబు కూల్చివేసిన ప్రాంతాల్లో ప్రహరీని తన సొంత ఖర్చుతో తిరిగి నిర్మించేందుకు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది.


ప్రహరీ కూల్చివేసిన ప్రాంతం

రోడ్ల నిర్మాణం పేరుతో అక్రమ తవ్వకాలు

ప్రకృతి వనరులను దోచేస్తున్న అధికార పార్టీ నేతలు


జెసిబితో ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న దృశ్యం

ప్రజాశక్తి - జి.కొండూరు : మండలంలోని చెవుటూరులో యథేచ్ఛగా పట్టపగలే ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్నారు. అక్రమార్కులు మంగళవారం చెవుటూరులోని స్థానిక గుర్రపు స్వామి గట్టు వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా భారీ ప్రొక్లైన్‌లు పదుల కొద్దీ ట్రాక్టర్లతో తవ్వకాలు సాగించారు. స్థానికుల సమాచారంతో రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకొని ప్రొక్లైన్, ట్రాక్టర్లను వెనక్కు పంపారు. గ్రామంలో సిసి రోడ్ల పేరుతో ఈ తంతు అధికార పార్టీ వారు సాగిస్తున్నారు. ఎక్కడ మట్టి, గ్రావెల్ ఉన్న అనుమతులు లేకుండా తరలించి సొమ్ము చేసుకోవటమే వీరిపని. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు గ్రావెల్ తరలిస్తున్న రెవెన్యూ అధికారులు మాత్రం స్థానికులు సమాచారం ఇచ్చేవరకు రాకపోవడం గమనార్హం. పైగా రెవెన్యూ అధికారులు అయ్యుండి గ్రామంలో సిసి రోడ్లు నిర్మించడానికే గ్రావెల్ తరలిస్తున్నారని అది ప్రజా శ్రేయస్సుకే కదా! అని అధికారులు అక్రమార్కులకు వంతాపడటం విశేషం. లక్షల్లో కాంట్రాక్టులు దక్కించుకొని ప్రభుత్వానికి ఏ విధమైన పన్నులు చెల్లించకుండా ఇలా అధికారులే మట్టి అక్రమార్కులకు వంతపడితే ఎలా అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇక్కడ కొసమెరుపు ఏమిటంటే పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఉన్న తవ్వకాలు జరుపుతుండగా నేరుగా రెవెన్యూ అధికారులు వెళ్లిన జెసిబి పైగాని ట్రాక్టర్లపై గానీ ఏ విధమైన కేసులు నమోదు చేయకుండా పంపించటం అధికారులు మట్టి అక్రమార్కులకు ఎంత సహకరిస్తున్నారో అర్థమవుతుందని పలువురు విమర్శిస్తున్నారు.


అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్, జెసిబిలను అడ్డుకున్న విఆర్ఒ

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటాలు

● కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు ● మచిలీపట్నంలో భారీ నిరసన ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక,రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ కార్మిక సంఘాల ,సంయుక్త కిసాన్ మొర్చా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్ నుండి కోనేరు సెంటర్ వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో వేలాది మంది కార్మిక వర్గాల రైతులు పాల్గొన్నారు. ఈ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం .హరిబాబు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినాటి నుండి కార్మిక రైతులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకొస్తూ అణిచివేత ధోరణి అవలంభిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఖండించాల్సిన రాష్ట్ర అధికార, ప్రతిపక్ష పార్టీలు మోడీకి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రజలను వంచిస్తున్నారని మండి పడ్డారు. అన్ని వర్గాల ప్రజలను వంచనకు గురి చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచైన తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించు కుంటామని అప్పటివరకు పోరాటాలను ఆపేది లేదని హెచ్చరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వాట్సాప్‌లో హై అని మేసేజ్ పెడితే ధాన్యం కొనుగోలు చేసేస్తామని చెప్తున్నా ఆచరణలో ఎక్కడా అమలకు నోచుకోలేదన్నారు. దీంతో రైతులు హాలో లక్ష్మణ అని ఏడుస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. విద్యుత్తు సవరణ చట్టం రద్దు చేసి,విద్యుత్ ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని లేనిపక్షంలో ప్రజల పక్షాన నిలబడి ఆందోళన చేస్తామని అయిన హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలకు సరైన పని భద్రత లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు, పట్నాలకు వలస పోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం దష్టిలో పెట్టుకుని ఉపాధిహామీ పనులను రోజుకు రూ.600 వేతనంతో 200 రోజులకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి నాగేశ్వరావు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ తాటిపర్తి తాతయ్య , కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు, టి చంద్రపాల్ బి సుబ్రహ్మణ్యం సిహెచ్ జయ రావు ,ఏ ఐ టి యు సి నాయకులు లింగం ఫిలిఫ్, ఎంఎల్ పార్టీ నాయకులు జె జగన్ ,రాంబాబు అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ రమాదేవి , బిల్డింగ్ వర్కర్స్ సింగ్ ఎండ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. గోపాలరావు, ఏఐటియుసి నాయకులు ఓ ఎల్ రావు, సత్యనారాయణ, కొమ్ముల సురేష్, బద్రీనాథ్, దుర్గాప్రసాద్, రంగారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే శివ నాగేంద్రం, కోశాధికారి టీవీ లక్ష్మణ స్వామి, సిఐటియు నాయకులు యు త్రిమూ ర్తులు, టి నరేష్, ఆర్‌సిపి రెడ్డి, ఎస్ నారాయ ణరావు, వాకా రామచంద్రరావు, బి కీర్తి, రజిని పాల్గొన్నారు.

కార్మిక, కర్షక ఉమ్మడి నిరసనకు సంఘీభావంగా ఐసిఇయు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్తంగా వివిధ డిమాండ్లపై ఢిల్లీలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి మద్దతుగా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపుమేరకు ఈరోజు మచిలీపట్నం నందు కొవ్వొత్తులతో సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఉద్దేశించి ఐసిఇయు ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్ మాట్లాడారు. యూనియన్ నాయకులు జె. సుధాకర్, , డి. వాసు, ఎల్. రాజశేఖర్, ఎ యు. రామాంజనేయులు, వై. స్వామినాథ్, ఎ. శ్రీనివాస రావు, బండి శ్రీనివాస్, ఎస్.వి. రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కెయులో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : పిజి కోర్సులలో చేరాలనుకునే విద్యార్థుల కోసం ఈ నెల 28 నుండి 30 వరకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా. ఎల్ సుశీల తెలిపారు. పిజి కోర్సులలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష కు హాజరుకానీ వారు, అర్హత సాధించని వారు కూడా అర్హులేనని తెలిపారు. కష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తమ సర్టిఫికెట్ల తో మచిలీపట్నం కు, నూజివీడు పిజి సెంటర్ లో చెరదలిచిన వారు అక్కడికి నేరుగా వెళ్లి రిపోర్ట్ చేయవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో 'మహిత' ప్రతిభ



ప్రజాశక్తి-ఘంటసాల : విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి 7వ మార్షల్ ఆర్ట్స్ (ఎస్క్యూఎవై) ఛాంపియన్ షిప్- 2024 సబ్ జూనియర్ విభాగంలో చల్లపల్లి చైతన్య పాఠశాలకు చెందిన 'కొడాలి మహిత' అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించింది. సిల్వర్ మెడల్ అందుకుంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఘంటసాల మండలం కొడాలి విజయకుమార్ కుమార్తె మహితను చైతన్య స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, స్వగ్రామానికి చెందిన పెద్దలు మంగళవారం అభినందించారు.

ఆర్‌బికెల్లో ధాన్యం పరిశీలన



మంత్రికి సమస్యలు వివరిస్తున్న రైతులు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం పునాదిపాడు, కోలవెన్ను గ్రామాలలో రైతు సేవా కేంద్రాలలో ధాన్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామాల్లోని రైతులతో మాట్లాడగా రైతులు అధికారులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అటు రైస్ మిల్లులు గాని, రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది గాని తమను పట్టించుకోవడంలేదని మంత్రి ఎదుట వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. రైతుల ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు కొనాలని సూచించారు. ఈకార్యక్రమలో మంత్రి వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్ గోపాలకృష్ణ

కల్తీ ఆహారం పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆహార పదార్థాలతో పాటు అన్నీ కల్తీమ యంగా ఉన్న నేటి పరిస్తితుల్లో అప్రమత్తతో వ్యవహరించి అనారోగ్యం, ప్రాణహాని నుండి జాగ్రత్తపడాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్ గోపాలకష్ణ అన్నారు. ఏజీఅండ్ఎస్ డిగ్రీకళాశాల రసాయన శాస్త్రం, ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఆహారంపై కల్తీ ప్రభావం అనే అంశముపై కళాశాలలో రెండురోజుల వర్క్షాప్ను మంగళవారం ప్రారంభి ంచారు. కల్తీ ఆహారం కల్తీవల్ల చెడు ప్రభావం, ఆహార కల్తీని ఎలా గుర్తించాలి, నిత్యం తినే ఏ ఆహార పదార్థాల్లో కల్తీ జరుగుతుందని, ఆధునిక ఆహార పద్ధతుల వలన జరిగే హానిని సవివరంగా విద్యార్థులకు తెలియచేశారు. ఆహారం కల్తీ జరగడానికి కారణాలు, కల్తీ ప్రభావం ప్రస్తుత పరిస్థితుల్లో ఎలా ఉందన్నది జోస్యుల నాగేశ్వరరావు వివరించా రు. కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. ర సాయన శాస్త్ర అధిపతి గిరిప్రసాద్, పీజీ అధిపతి వియన్వి కిషోర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల తొలగింపునకు కంట్రోల్ రూం ఏర్పాటు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లాలో రైతులు ఖరీఫ్ 2024-25లో ధాన్యం విక్రయించడంలో ఎటువంటి ఇబ్బందులు/ సందేహాలు / సమస్యలు ఉన్నచో వాటిని పరిష్కరించడానికి జిల్లా మేనేజర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ప్రకటనలో తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ లో ఇద్దరు సిబ్బందిని ఏర్పాటు చేశామని, ఈ సిబ్బంది ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రైతుల ఫిర్యాదులు, సందేహాలు, సమస్యలు స్వీకరించి పరిష్కారం కొరకు తగిన సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. కనుక రైతులు తమకు ధాన్యం విక్రయించడంలో ఎదురైన సమస్యలకు 8247693551ను సంప్రదించాలన్నారు.

మచిలీపట్నం సుందరీకరణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం నగరంలో తడి పొడి చెత్తను సక్రమంగా సేకరించి నగర సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో నగరంలోని పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి తరలించేందుకు వీలుగా ట్రాక్టర్లను ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. డంపింగ్ యార్డ్ లోనే తడి పొడి చెత్త వేరువేరుగా నిల్వ చేసేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని, తడి చెత్తను ఎరువుగా మార్చి నగరంలోని డివైడర్లపై ఉన్న మొక్కలకు వినియోగించాలన్నారు.

జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపిక



ప్రజాశక్తి-అవనిగడ్డ : డిసెంబర్ 7,8,9 తేదీలలో హర్యానాలో జరిగే జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు అవనిగడ్డకు చెందిన ఈశ్వర్ అకాడమీ విద్యార్థులు ఎంపి కైనట్లు అకాడమీ నిర్వాహకులు కష్ణాజిల్లా సెక్రెటరీ మాస్టర్ ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ను జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కలిశారు. ఈనెల 24న ఎన్టీఆర్ జిల్లాలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో ఈశ్వర అకాడమీ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు పాల్గొని పలు విభాగాలలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బంగారు పథకాలతో పాటు పలు విభాగాల్లో పథకాలు సాధించి దివిసీమ ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింప చేస్తున్న మాస్టర్ ఈశ్వర్ మాస్టర్ విశ్వాలను విద్యార్థులను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ యువ నాయకులు మండలి వెంకట్రామ్ అభినందించారు.

'పల్లె ప్రగతి పాదయాత్ర'

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని యనమలకుదురులో పల్లె ప్రగతి పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన మంగళశారం ఎంఎల్ఎ బోడే ప్రసాద్ ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రధానంగా తాగునీటి, డ్రైనేజి, పెన్షన్, ఇల్లు సలాలు సమస్యల గురించి ఎంఎల్ఎకు విన్నవించారు. త్వరతిగతిన వాటికి పరిష్కారం చేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలను అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఏ బోడే ప్రసాద్

నారాయణమూర్తి సేవలు చిరస్మరణీయం



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు గ్రామ పురోగమనానికి దోహదం చేసిన ప్రగతి శీలి, విద్యాపోషకుడు, రైతుకు నేస్తం, ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వివిఆర్ఎస్అర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, పాలిటెక్నిక్ వ్యవస్థాపక అధ్యక్షులు అడ్డుమిల్లి అశ్వర్ధ నారాయణ మూర్తి 119 వ జయంతి పాలిటెక్నిక్ ఆవరణలో మంగళవారం ఘనంగా జరిగింది. తొలుతగా నూతన మేనేజింగ్ ట్రస్టీ గా ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్. ఎడ్యుకేషనల్ సొసైటీ సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ రెండవ మేనేజింగ్ ట్రస్టీ అయిన శ్రీ కొడాలి వెంకట కృష్ణారావు నుండి బాధ్యతలు స్వీకరించారు. అడ్డుమిల్లి అశ్వర్ధ నారాయణమూర్తి సేవలు చిరస్మరణీయమని ఆయన ఆశయాలు, కార్యాచరణ, వ్యక్తిత్వం నేటి యువతకు మార్గదర్శకాలు అని నూతన మేనేజింగ్ ట్రస్టీ వల్లూరుపల్లి రామకష్ణ తెలిపారు. అనంతరం 154 మంది వద్దులైన స్త్రీ, పురుషులకు రూ. 69,200 విలువ గల వస్త్రములను, 55మంది విధ్యార్ధులకు రూ.69,000 విలువ గల ఉపకార వేతనాలను అందించారు. ఈ కార్యక్రమంలో వల్లభనేని సుబ్బారావు, అడ్డుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, వల్లూరుపల్లి సత్యనారాయణ, ఉప్పలపాటి సత్యనారాయణ, పొట్లూరి రవికుమార్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ , పాలిటెక్నిక్ ఎగ్జిక్యూటివ్ మెంటార్ ఎన్.ఎస్.ఎస్.వి. రామాంజ నేయులు, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణ కుమార్ , సంస్థల యాజమాన్య సభ్యుల సలహాదారు డా.పొట్లూరి రవీంద్ర బాబు,ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా

గిట్టుబాటు ధర కల్పించాలి - వేదాద్రి ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయాలి
నిత్యావసరాల ధరలు తగ్గించాలి - కౌలు రైతు సంఘం, సిఐటియు నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - నందిగామ : గిట్టుబాబు ధరలు, సన్నకారు, చిన్న రైతులు, కౌలు రైతులకు బ్యాంకు రుణాలు తగిన స్థాయిలో లభించక పత్తి రైతుల ఆత్మహత్యలతో ప్రారంభమైన రైతు ఆత్మహత్యల పరంపర నేటికీ కొనసాగుతూనే ఉందని కౌలు రైతు సంఘం, సిఐటియు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వద్ద బుధవారం కార్మికులు, రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్ అధ్యక్షత వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్, చిరుమామిళ్ల హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కోట కృష్ణ మాట్లాడారు. వేదాద్రి ఎత్తిపోతల పథకానికి వెంటనే మరమ్మతులు చేయాలని, సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి పత్తి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. మున్నేరుపై పోలంపల్లి ఆనకట్టకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని, లింగాల వద్ద మునేరుపై బ్రిడ్జిని నిర్మించాలని, వర్షాల వల్ల దెబ్బతిన్న భూములకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుబాబులకు టన్ను ధర రూ.6500 స్థిరీకరించాలని, వరదల వల్ల నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నందిగామలో పట్టణంలో మంచినీరు అందించాలని డిమాండ్ చేశారు. నందిగామ ఆర్‌డిఒ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపి నాయక్, నందిగామ సిఐటియు నాయకులు కర్రి వెంకటేశ్వరరావు ,లాజరు, రైతు సంఘం నాయకులు ఎర్ర శీను, చెరుకుమల్లి పిచ్చయ్య, సిఐటియు వీరులపాడు మండల కార్యదర్శి షేక్ లాలా మహమ్మద్ గౌస్, చాట్ల రవి, కోడూరు పిచ్చేశ్వరావు, వత్సవాయి సిఐటియు మండల కార్యదర్శి బి.రాము, చందర్లపాడు సిఐటియు మండల కార్యదర్శి వేల్పుల ఏసోబు, పెనుగంచిపోలు మండల కార్యదర్శి ధారా నాగేశ్వరావు, గురవయ్య, జగ్గయ్యపేట సిఐటియు మండల కార్యదర్శి గౌస్, చారి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కొల్లి సరళ, సుజాత, ఆశ వర్కర్ యూనియన్ నాయకులు నాగమణి, తిరుమల పాల్గొన్నారు.

తిరువూరు : తిరువూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ముందు సిఐటియు, ఎఐటియుసి, రైతుసంఘం, తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, రెడ్డిగూడెం, విశ్శన్నపేట మండలాల చెందిన కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. పంటకు సరైన గిట్టు బాటు ధర కల్పించాలని, సోమనాథన్ కమిషన్ కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలని, అడ్డు అదుపులేకుండా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, ట్రూ ఆప్ విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని తదితర డిమాండ్లతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌డిఒ మాధురికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులపైనే కాకుండా కార్మికులు, ఉద్యోగులు రైతులు తదితర వర్గాల ప్రజల భారాలను మోపుతున్నాయని ఆరోపించారు. కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మాత్రం ప్రధాని మోడీకి అండగా ఉండటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో తిరువూరు గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాలకు చెందిన సిఐటియు, రైతుసంఘం నాయకులు బి.వెంకటేశ్వరరావు, జానపాటి వెంకటేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వరావు, వి.నాగరాజు, జి.వెంకటరత్నం, ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.మాధవరెడ్డి, ఉయ్యూరు కృష్ణారెడ్డి, ఎం.వెంకట రెడ్డి పి.ఆనందరావు, ఎస్‌వి.భద్రం, ఎఐటియుసి నాయకులు తూము కృష్ణయ్య, నాగుల్ మీరా, ఎం.ఉదయ్ సుభానితో పాటు మున్సిపల్ కార్మికులు అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నందిగామ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న కమల



తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు, కార్మికులు

మహిళలపై హింస నివారణలో విఫలం



మాట్లాడుతున్న ఎస్.కుమారి

ప్రజాశక్తి - తిరువూరు : అంతర్జాతీయ మహిళా హింసా వ్యతిరేక దినోత్సవాన్ని ఐద్వా ఆధ్వర్యంలో మంగళ వారం తిరువూరు శ్రీనిధి జూనియర్ కళాశాలలో నిర్వహించారు. మహిళల పట్ల హింస పెచ్చి రిల్లిపోతున్నప్పటికీ నివారించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయని ఐద్వా రాష్ట్ర నాయకురాలు ఎస్.కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల పట్ల హింసే కాకుండా దాడులు, హత్యలు, హత్యా చారాలు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయని చెప్పారు.ఐద్వా నాయకురాలు పి.తులసీరాణి, ఎం. లక్ష్మి, ఎం నాగమణి పాల్గొన్నారు.

విద్యార్థుల భోజనం పరిశీలన

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానికంగా ఉన్న కెజిబివి పాఠశాలను తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి సందర్శించి పరిశీలించారు. మొదటగా విద్యార్థుల ప్రతిభను పరిశీలించి అనంతరం విద్యార్థులకు తయారుచేసిన భోజన పదార్థాలను పరిశీలించి చూశారు. అవసరమైన సలహాలు పాఠశాల సిబ్బందికి ఇచ్చారు. ప్రిన్సిపల్ మోక్షగుండం వెంకటలక్ష్మి, మండల రెవెన్యూ అధికారి వీరభద్రరావు ఉన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైయస్సార్సీపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇంచార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి భగవద్గీత, బైబిల్, ఖురాన్ ల వంటి పవిత్ర గ్రంథాలుగా భావించి, అంకిత భావంతో సంక్షేమ హామీలను అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయటానికి ఆపసోపాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఐదు నెలల్లోనే ప్రజలపై ఏకంగా 17 వేల కోట్లకు పైగా కరెంట్ చార్జీల భారాన్ని మోపడాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు : వాహినీ ఇంజనీరింగ్ కాలేజీలో సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. మంగళవారం సీనియర్ న్యాయవాది కంచర్ల ముత్యప్రసాద్ అధ్యక్షతన టౌన్ హాల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ ఆర్.రాఘవరావు మాట్లాడుతూ సైబర్ సెక్యూర్టీ, ఫ్రాడ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి ఫేక్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వటం కానీ 1930 నెంబరుకు కాల్ చేసి చెప్పాలని ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొత్తూరు గంగాధర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు న్యాయవాది నాగుబండి రామకృష్ణ, ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్టు నందిగామ రెవిన్యూ డివిజన్ అధికారి బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. నందిగామ, జగ్గయ్యపేట, వీరులపాడు, బుదవాడ,పోచంపల్లి, రామిరెడ్డిపల్లి, అనాసాగరం, చిల్లకల్లు, జయంతి, చెరువు కొమ్ము పాలెం తదితర ప్రాంతాల్లో ఖాళీగా వున్న డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు.

జగన్మోహన్‌రావుకు నివాళి



ప్రజాశక్తి - గంపలగూడెం : స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు సువారపు జగన్‌మోహన్‌రావు సోమవారం రాత్రి మృతి చెందారు. జగన్మోహన్‌రావు మృతదేహాన్ని సిపిఎం నాయకులు సందర్శించి, ఘనంగా నివాళు లర్పించారు. రాష్ట్ర నాయకులు బిఆర్ తులసి రావు, జిల్లా నాయకులు ఎస్.నాగేశ్వర్‌రెడ్డి, జి.వెంకటరత్నం, సిహెచ్.వీరారెడ్డి, జి.సీతారామిరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, జె.వెంకటేశ్వరరావు, ఎం.గోపి, ఎం.గోపాల్‌రావు, తదితరులు నివాళులర్పించారు.

ఉత్తమ సేవల్లో ఎస్‌బిఐ ముందంజ

రీజినల్ మేనేజర్ వి.నవీన్‌బాబు

ప్రజాశక్తి - నందిగామ : ఖాతాదారులకు ఉత్తమమైన సేవలను అందించడంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పుడు ముందంజలో ఉంటుందని రీజనల్ మేనేజర్ వి.నవీన్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నందిగామ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో నందిగామ మెయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో టౌన్‌హాల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్ఎం వి.నవీన్ బాబు మాట్లాడుతూ స్టేట్ బ్యాంకు ద్వారా తమ ఖాతాదారులకు ముద్రలోన్లు, ఎలాంటి సెక్యూరిటీ లేకుండా 10 లక్షల నుండి రెండు కోట్ల వరకు బిజినెస్ లోన్స్, పెన్షనర్స్ పెన్షన్ హౌసింగ్ లోన్లు, కారులోన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ నేరాలను ఎలా ఎదుర్కోవాలో వీడియోలు ద్వారా వివరించారు. మెయిన్ బ్రాంచ్ మేనేజర్ వైసిహెచ్.కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఎం ఆపరేషన్స్ మనోజ్‌కుమార్, ఆర్ఎసిసి చీఫ్ మేనేజర్ డి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, పట్టణ టిడిపి అధ్యక్షులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏచూరి రాము, పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షులు గుప్తా, మాజీ జిల్లా పరిషత్ సభ్యులు వాసిరెడ్డి ప్రసాద్, కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు కేతేపల్లి సత్యబాబు ఖాతాదారులు,తదితరులు పాల్గొన్నారు.



ఖాతాదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ నవీన్ బాబు

మైనర్లకు మోటర్‌సైకిల్ ఇవ్వొద్దు : సిఐ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద మంగళవారం వాహనాలను జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు ట్రాఫిక్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేయగా వారిలో అధిక శాతం మైనర్లను గుర్తించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ పి.వెంకటేశ్వర్లు మైనర్ల, తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను తీసుకొని వారితో ఖరీదైన మోటర్ వాహనాలను మైనర్లకిచ్చి నడపటానికి ప్రోత్సహించొద్దని, ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగే భవిష్యత్తు పాడౌతుందన్నారు. పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని వారి తల్లిదండ్రులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.శ్రీనివాసరావు, టౌన్ ఎస్ఐ జి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



యువతకు అవగాహన కల్పిస్తున్న సిఐ

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి : సామినేని

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రాష్ట్ర రేషన్ డీలర్ల సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎపి రేషన్ డీలర్ సంఘం నూతన నాయకులకు జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను హామీ ఇచ్చారు. నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ వేదికకు అధ్యక్షుడిగా ఎన్నికైన ముత్యాల శేషు, ప్రధాన కార్యదర్శి టి.రవిచంద్ర రెడ్డి, కోశాధికారి బుంగ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివప్రసాద్, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు ఉదయశ్వరరావు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు జాయింట్ సెక్రటరీలు మంగళవారం ఉదయభాను స్వగహం వద్ద సామినేని ఉదయభాను ని మర్యాదపూర్వకంగా కలిశారు. డీలర్ సంఘ నాయకులు ముత్యాల శేషు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రేషన్ డీలర్ల ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ఓటు నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - గంపలగూడెం : 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకోవాలని గంపలగూడెం తహశీల్దార్ రాజకుమారి కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విశిష్ట డిగ్రీ కళాశాల సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటు నమోదుతో దేశ పరిపాలనలో భాగస్వాములు అవుతామని వివరించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, మండల రెవెన్యూ అధికారి వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

సర్పంచ్ రాజీనామా

ప్రజా శక్తి వత్సవాయి :

పెంట్యాల వారి గూడెం గ్రామ సర్పంచ్ వడ్డేపరమయ్య జనసేన పార్టీకి మంగళవారం రాజీనామ చేసి వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్న) ఆధ్వర్యంలో ఆపార్టీలో చేరారు. ఈ సందర్భంగా చిన్నా ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పెంట్యాల నరసింహారావు, పొన్నం హరీష్ పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి - తిరువూరు:

రాగల 72 గంటల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో రైతన్నలు వరి కోతలు మూడు రోజులు పాటు వాయిదా వేసుకోవాలని తిరువూరు మండల వ్యవసా యాధికారి పి.పద్మ సూచించారు. మండలం లోని ఆంజనేయపురంలో వ్యవసాయాధి కారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంట కోసిన రైతులు పనలు లేదా వరి ధాన్యాన్ని పట్టాలు కప్పి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కళ్ళాలలో వరి ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లయితే ఆయా గ్రామంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి లేదా వ్యవసాయ అధికారికి సమాచారం ఇస్తే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తారని పద్మ పేర్కొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ క్యారీబ్యాగుల వినియోగం స్వచ్ఛందంగా విడనాడాలని స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్ కోరారు. మంగళవారం ఉదయం స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు విజయవాడ రోడ్డులో శ్రమదానం చేశారు. పిచ్చిమొక్కలు, కంప తొలగించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థములు తొలగించారు. కార్యక్రమంలో సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ తరిగోపుల పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, స్వచ్ఛ కార్యకర్తలు, పద్మావతి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు


ప్రజాశక్తి-చల్లపల్లి : విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈనెల 24వ తేదీన జరిగిన రాష్ట్ర స్థాయి స్కేవ్ ఛాంపియన్షిప్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ సురేష్, ఈ.జి.ఎం. మురళీకష్ణ తెలిపారు. పాఠశాల నుండి 29 మంది విద్యార్థులు పాల్గొనగా ఆరు బంగారు పతకాలు, 16 సిల్వర్, రజిత పతకాలు సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించిన విజేతలను మంగళవారం స్కూల్లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. విజేతలను రీజనల్ ఇన్చార్జి రాజేష్ బాబు, కోచ్ సుబ్బు, జాహ్నవి, ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది అభినందించారు. బంగారు పతకాలు సాధించిన ఆరుగురు విద్యార్థులు డిసెంబర్ 7, 8, 9 తేదీలలో హర్యానాలో జరిగే జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-నాగాయలంక : పార్టీ సభ్యత్వాలు వేగ వంతంగా చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు అన్నారు. నాగాయలంక బీసీ కాలనీలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉప్పల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మత్స్య కార సహకార సంఘం జిల్లా డైరెక్టర్ కర్రి కష్ణమూర్తి, నాగమణి, చంద్రరావు, ఒడుగు నాగ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : ఉపాధి హామీ కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లోని తన చాంబర్ నుంచి పంచాయతీరాజ్, డ్వామా, గ్రామ వార్డు సచివాలయా తదితర శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయా శాఖల ద్వారా జరుగుతున్న అభివద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఇంకా చేపట్టవలసిన పెండింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని, ఆయా పనులు పూర్తయిన వెంటనే అందుకు సంబంధించిన బిల్లులను సకాలంలో అప్లోడ్ చేసి కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిఎస్టి, జిఎస్టి యేతర రిజిస్టర్ లను తప్పనిసరిగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.అదేవిధంగా జిల్లాలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి మందగించిందని, రేపటి నుంచి వ్యక్తుల మరణాలు, వలసలకు సంబంధించిన ఆప్షన్లను ఎంచుకునేందుకు యాప్ లో పొందుపరు స్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రక్రియను వేగవంతం చేసేలా అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ జెడ్పీ సీఈఓ ఆనంద్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్.ఇ. రమణారావు, డ్వామా పిడి శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డిఎల్డిఓలు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉద్యోగుల సంఘం హర్షం

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. ఆర్. సూర్యనారాయణపై పెట్టిన అక్రమ కేసుల నుంచి బయట పడటంపై సంఘ కృష్ణా జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు పి.రాము, తోట వరప్రసాద రావు లు, కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేసులను త్వరితగతిన విచారణ జరుగుటకు చొరవ చూపిన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ,మంత్రి వర్యులు నారా లోకేష్ దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్వి రామారావు, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, ఏ రమేష్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి గోపీచంద్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎస్ గణేష్ రెడ్డి వి రఘుబాబు, బి విజయబాబు, దుర్గాప్రసాద్, వి ప్రసాద్, డి రవికష్ణ, జై దుర్గాప్రసాద్ ,ఎం శ్రీనివాసరావు , కే సతీష్, డి మోహన్ రావు ,ఎం నాగేంద్రరావు, డి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తుందని గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు, ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు . గన్నవరం క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలు అనారోగ్య కారణాలతో బాధపడు తున్న 9 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు.


తాతపూడి గణేష్‌కు అభినందనలు

ప్రజాశక్తి-కంకిపాడు : తాడిగడప మున్సిపాలిటీలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఆంధ్ర ప్రదేశ్ రజక కార్పొరేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్మెంట్ డైరెక్టర్ గా నియమితులైన తాతపూడి గణేష్‌ను యలమలకుదురు 14వ డివిజన్ అధ్యక్షులు సజ్జ ప్రకాష్, జన సైనికులు కలసి అభినందనలు తెలిపారు.



గణేష్‌కు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

నేడు బాధ్యతల స్వీకారం



ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ నాయకులు రాష్ట్ర బీసీ సంఘం నాయకులు చిలకలపూడి పాపారావు బుధవారం విజయవాడలోని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం భవన్లో పదవి బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయన కార్యాలయం ప్రతినిధి తెలిపారు. మంగళవారం అవనిగడ్డలో విలేకరులతో మాట్లా డుతూ ఉదయం 10 గంటలకు చేపట్టబోయే ఈ పదవి బాధ్యత మహోత్సవానికి కూటమి నేతలు పాపారావు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



భగవద్గీత పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నేటి బాలలే రేపటి పౌరులు అనే నానుడిని అక్షర సత్యం చేస్తూ మానవులందరికీ భగవద్గీత అనే పుస్తకాన్ని ఉచితంగా పాఠశాల విద్యార్థులకు అందజేశారు. మంగళవారం స్థానిక విద్యాలయ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయ్‌భాస్కర్, టిటిడి ధర్మాచార్య కావూరి శ్రీధర్‌లు 700 మంది విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యమ్ .శ్రీధర్, విద్యార్థులు, పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం కలెక్టరేట్లో మీకోసం మీటింగ్ హాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో భారత రాజ్యాంగ పీఠిక కలెక్టర్ చదివి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డ్వామా పిడి శివ ప్రసాద్, ఆర్ అండ్ బి ఈఈ లోకేష్, సి పి ఓ గణేష్ కష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్** : బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ అందరివాడని, ఆయన దేశం ఆస్తి అని కష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు ఉద్బోధించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భముగా ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎన్ ఉష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని పెంజెంద్ర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో భారత రాజ్యాంగం విశిష్టత, రాజ్యాంగంలో పొందుపరచిన విషయాలపై వివరించారు. విద్యార్థులు భారత రాజ్యాంగం సంబంధించిన ముగ్గుల రూపంలో పొందుపరిచారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, లయన్ బొప్పన శివప్రసాద్, లైన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు నాగబాబు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : భారత రాజ్యాంగం అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగి భిన్నత్వంలో ఏకత్వంగా విరాజిల్లడం భారతదేశ గొప్పతనమని ఉయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ టివి రామారావు అన్నారు. మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉయ్యూరు లోని జిల్లా గ్రంథాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకులు పి నమాల నాగ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్కిల్ ఇన్స్పెక్టర్ బహుమతి ప్రధానం చేశారు. లైన్స్ క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల సాయి తేజ వెంకట్. లైన్స్ క్లబ్ పూర్వాధ్యక్షులు మహమ్మద్ ఇస్మాయిల్ డివైఈవో పద్మారాణి సిహెచ్ కుటుంబ రాజు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కొలసాని రవి కుమార్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ** : మండలంలోని ప్రముఖ నాట్య క్షేత్రం కూచిపూడి సెంటర్లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అంబేద్కర్ సంఘ నాయకులు పాగోలు రమేష్ బాబు, కంచర్ల నిర్మల, కొప్పుల రాజేంద్ర, కూరపాటి బాలకష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : గన్నవరం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో గన్నవరం ఎమ్మెల్యే , ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు డా.బి..ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : పమిడిముక్కల ఎండిఒ కార్యాలయంలో బిఆర్ అంబేద్కర్‌చిత్రపటానికి ఇన్చార్జ్ ఎంపీడీవో దేవరపల్లి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండల ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, మండల సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి పెడన** : పెడన మండలం బలిపర్రు గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి వై ఎస్ ఆర్ సి పి పెడన నియోజకవర్గం ఇన్చార్జ్ ఉప్పాల రమేష్ (రాము), పార్టీ నాయకులు ఘనంగా పూలమాలతో నివాళులర్పించారు. వైఎస్ఆర్సిపి పట్టణ, గూడూరు మండలం అధ్యక్షులు బండారు మల్లి, పర్ణం పెదబాబు, గూడూరు జడ్పిటిసి సురేష్ రంగబాబు, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, గరికముక్కు చంద్రబాబు, సర్పంచులు గరికపాటి వెంకట రామానాయుడు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి** : స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సాబుజాన్, ప్రిన్సిపాల్ ఝాన్సీ సాబుపాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులు అందరూ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు** : మండలంలోని వీరవల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరవల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పిల్లా అనితా రామారావు, టిడిపి సీనియర్ నాయకులు గుండపనేని ఉమా వరప్రసాద్ (బుజ్జి) పిల్లా రామారావు, మండాది రవీంద్ర, ఇన్చార్జి ఈవో పి సురేష్ కుమార్ పాల్గొన్నారు.**ప్రజాశక్తి-నాగాయలంక** : నాగాయలంక పార్క్ పక్కన ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నాగాయలంక ఎస్సీ, ఎస్టీ కమిటీ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ప్రెసిడెంట్ మంచాల తిరుపతి వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కందుల శంకర్, సెక్రటరీ తానంకి పోతురాజు, తానింకి వేణు పాల్గొన్నారు.**ప్రజాశక్తి - గుడివాడ** : స్థానిక గౌరీశంకరపురంలోని డా॥ బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ భవనంలో అంబేద్కర్ చిత్రపటానికి 1టౌన్ సిఐ శ్రీనివాస్, తాలుకా ఎస్.ఐ చంటిబాబు, కృష్ణా జిల్లా ఆదిమాంధ్ర సంఘం అధ్యక్షుడు పొంగులేటి జయరాజ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డు విల్సన్‌బాబు, సభ్యులు మెండా కిరణ్‌కుమార్, బెజ్జం సువర్ణరాజు, మెండు రమేష్(జోజిబాబు), దోనే కోటిబాబు, ఎస్సీ నాయకులు కంచర్ల సుధాకర్ పాల్గొన్నారు. అలాగే స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక భయ్యా వారి వీధిలోని మండలి హనుమంతరావు కార్యాలయంలో వైసిపి నాయకులు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గం టిడిపి అబ్జర్వర్ కనపర్తి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ది డ్ల ప్రసాద్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు నలుకుర్తి రమేష్, జిల్లా అధ్యక్షులు గుర్రం బసవయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. **ప్రజాశక్తి-మోపిదేవి** : మోపిదేవి మండలం బొబ్బర్లంక గ్రామంలో బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీనియర్ సిటిజన్ లింగం నాగబసవయ్య లింగం బసవ శంకరరావు, లింగం సముద్రాలు, కనపర్తి ఆది శేషు,లింగం జయంతిరావు, లింగం రామారావు, లింగం వేణుకుమార్ పాల్గొన్నారు.

'యువ సంగం' కోసం యుపికి విద్యార్థులు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : యువ సంగం 2024 కార్య క్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి ఎంపికైన 42 మంది విద్యార్థుల బృందం ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నుండి ఉత్తరప్రదేశ్‌కు 10 రోజుల సాంస్కృతిక మార్పిడి యాత్రను ప్రారంభించింది. ఈ కార్యక్రమం, 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' లక్ష్యానికి అనుగుణంగా, భారతదేశ యువతలో సాంస్కృతిక ఐక్యత, సహకారాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని నిర్వాహకులు రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని ఆర్కిటెక్చర్ కళాశాల వద్ద నుండి మంగళవారం విద్యార్థులు బయలుదేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువ సంగం 2024 అనేది భారతదేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమం కింద చేపట్టిన ఒక కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ శ్రీకొండ (డైరెక్టర్), కె వి ఉమా మహేశ్వరరావు (రిజిస్ట్రార్), డాక్టర్ వెంకట కష్ణ కుమార్ సాధు (డీన్ స్టూడెంట్స్ అఫైర్స్), డాక్టర్ భగవత్ జయేష్‌కుమార్ మహేశ్‌కుమార్ (యువ సంగం 2024 సమన్వయకర్త) పాల్గొన్నారు.



18 మందికి ఉద్యోగావకాశం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళ వారం నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించారు. ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్-ఎస్‌డిసి) జిల్లా ఉపాధి కల్పన శాఖ డిఆర్‌డిఎ -సీడాప్ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళాలో 37 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. 18 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. యాక్సిస్ బ్యాంక్, మెడ్ ప్లస్, సుధీర్ టింబర్ డిపో కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుశీలరావు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు



ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక 39వ డివిజన్‌లో టిడిపి సభ్యత్వం నమోదు చేస్తున్నట్లు ఆ డివిజన్ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణరావు తెలిపారు. మంగళ వారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రేగళ్ళ లక్ష్మణరావుతో పాటు రెంటపల్లి రవికుమార్ తదితరులు పాల్గొని ఇంటింటికీ వెళ్ళి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు రేగళ్ళ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇప్పటికే సుమారు వెయ్యి సభ్యత్వాలు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల నుండి స్పందన లభిస్తోందని అన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు : సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజక వర్గంలో చిన్నాభిన్నంగా ఉన్న రోడ్లను గుర్తించి వాటి ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వ విప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య అధికారులను ఆదేశించారు. నందిగామ పట్టణం కాకానిలో రాష్ట్ర ప్రభుత్వ విప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య కార్యాలయంలో మంగళవారం రహదారులు, భవనాల శాఖ అధికారులతో సమావేశమై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల చందర్లపాడు నుంచి పొక్కునూరు గ్రామ మరమ్మత్తు పనులను శరవేగంగా పూర్తి చేశామన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని ఆదరించాలి

దేశ్ కా ప్రకృతి పరిరక్షణ అభియాన్ యాప్ ఆవిష్కరణలో వక్తలు



యాప్‌ను ప్రారంభిస్తున్న సాయి సుధాకర్, తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆయుర్వేద వైద్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో దేశ్‌కా ప్రకృతి పరిక్షన్ అభియాన్ - 2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎన్.ఆర్.ఎస్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇన్చార్జి ఎ.డి డాక్టర్ సాయి సుధాకర్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాలలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం సాయి సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి వివరాలను పొందుపరచేందుకు ఈ నెల 26 నుండి డిసెంబర్ 25 వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. దేశ్ కా ప్రకృతి పరిక్షన్ అభియాన్ పేరుతో ప్రత్యేక యాప్‌ను దేశ ప్రధాన మంత్రి ప్రారంభించారని అన్నారు. ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని వారి వివరాలను నమోదు చేయాలన్నారు. ఆయుర్వేద జీవన విధాన పద్ధతులతో ఆయుష్‌ను పెంచుకొని ఆరోగ్యవంతులుగా జీవించాలనేదే దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ యాప్ ద్వారా వ్యాధులను అధికమించేందుకు ఆచరించవలసిన పద్ధతులను తెలుపుతారన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి పౌరుడు యాప్ ద్వారా వివరాలను నమోదుచేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల విద్యార్థులు 'నా సంకల్పం నా ఆరోగ్యం దానికి మూలం ఆయుర్వేదం' అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల జ్యోతీ భాయి, కో ఆర్డినేటర్ డాక్టర్ కె.విజయకుమారి, విజయ శ్రీ, పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ : కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అభియాన్ యాప్‌ను మంగళవారం నందిగామలో ఆయుర్వేదం వైద్యులు ప్రదర్శన చేసి ప్రారంభించారు. దేష్‌కి ప్రకృతి పరీక్షన్ అభియాన్ అనే ఆయుర్వేద యాప్‌ను దేశ వ్యాప్తంగా మంగళవారం ప్రారంభించారు. నందిగామ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెవిఎస్ సత్యనారాయణ ఈ ప్రత్యేక ఆయుర్వేద యాప్‌ను మంగళవారం రోజు నందిగామ డివిజినల్ ఆయుర్వేద వైద్యశాలలో ప్రారంభించారు. ఆయుర్వేదం ప్రకారం, ప్రతి వ్యక్తి శరీర నిర్మాణం ప్రత్యేకమైనదని తెలిపారు. ఈ యాప్ ప్రతివ్యక్తి శరీర ధర్మస్వభావాన్ని (వాత, పిత్త, కఫ) గుర్తించి, ఆ వివరాల ఆధారంగా ఆరోగ్య స్థితిగతులను, జీవనశైలి విధానాన్ని పొందుపరుస్తుందన్నారు. ఆయుర్వేదం ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఇది మరింత ఆసక్తి కలిగించేలా ప్రాధాన్యతను పొందిందని తెలిపారు.

పలుచోట్ల రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

భారత ప్రజలకు 75 ఏళ్లుగా అనుక్షణం తోడుగా, నీడగా ఉంటూ వస్తున్న రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమున్నత భారత రాజ్యాంగం చూపిన బాటలో నడిచి ఉత్తమ పౌరులుగా ఎదగాలని పలువురు వక్తలు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పలుచోట్ల వేడుకలు నిర్వహించారు.


విజయవాడలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడలోని కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠికను చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వతంత్ర భారతావనిని అత్యుత్తమ ప్రజాస్వామ్య వ్యవస్థతో సగర్వంగా నిలిపిన రాజ్యాంగాన్ని 1949, నవంబర్ 26న ఆమోదించుకోవడం జరిగిందని.. దేశ చరిత్రలో అపూర్వమైన ఈ ఘట్టానికి గుర్తుగా ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని వేడుకగా జరుపుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్ భారత రాజ్యాంగ ప్రవేశికను అధికారులు, సిబ్బందితో ప్రమాణం చేయిస్తూ చదివించారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో మంగళవారం 75వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైసీపీ కార్పొరేటర్ కుక్కల అనిత రమేష్ హాజరయ్యారు. **విజయవాడ :** విజయవాడ సింగ్‌నగర్ లోని ఎంకే బేగ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మండల విద్యాశాఖ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆదూరి వెంకటరత్నం మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సమ,న్యాయం అనేటు వంటి నాలుగు పిల్లర్ల మీద రాజ్యాంగం నిర్మించబడిందని, దాని మౌలిక స్వభావాన్ని ఎవరు కూడా మార్చటానికి వీలులేనంతగా దృఢ రాజ్యాంగంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ మామిడి శ్రీనివాస్ మాట్లాడారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిస వెంకటేశ్వరరావు, హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ సభ్యులు శ్రీధర్మరాజు, గిరిబాబు, సురేష్, రాజశేఖర్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** చిట్టినగర్ సెంటర్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా మంగళవారం పోతిన వెంకట మహేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **తిరువూరు :** అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో అంబేద్కర్ చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బూజు బొమ్మ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూల మాల లు వేసి నివాళులర్పించారు. నగర పంచాయతీ కార్యాలయంలో చైర్పర్సన్ జి కస్తూరిబాయి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేశారు. **నందిగామ :** నందిగామలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోనాయపాలెంలో మాక్ అసెంబ్లీ, క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు నాగినేని లీలారాణి తండ్రి నాగినేని శ్రీనివాస రావు జన్మదినం సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు బహుమతి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డివియల్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నందిగామ : విస్సన్నపేట :** విస్సన్నపేట పట్టణంలో 75 వ భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు వైఎస్‌ఆర్సిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, బాబు జగజ్జీవన్ రావు విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. పట్టణ వైసిపి అధ్యక్షులు నెక్కళపు వెంకట కుటుంబరావు, గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి వెంకట శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు గద్దల మల్లయ్య, తిరుపతిరావు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలో సాయిబాబా గుడి వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి శాసనసభ్యులు, ఏపీ పీఎస్సీ సభ్యులు, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య స్థానిక నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. జగ్గయ్యపేట ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నేపాగ సుందర్‌రావు ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, ఎడియం శోభారాణి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పసుపులేటి శ్రీనివాసరావు జె శ్రీనివాసరావు సంతోష్, న్యాయవాదులు పాల్గొన్నారు. పట్టణంలోని జనసేన జిల్లా అధ్యక్షులు, సామినేని ఉదయభాను స్వగృహంలో ఏర్పాటు చేశారు. **కంచికచర్ల :** కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు పూలమాల వేసి నివాళులర్పించారు. **మైలవరం :** రాజ్యాంగ దినోత్సవం మైలవరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆరో వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో, ప్రధానోపాధ్యాయులు పి గోపాల్ విద్యార్థులచే రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. **గంపలగూడెం :** తోటలో బాబు జగజ్జీవన్ రామ్ అంబేద్కర్ల విగ్రహాలకు ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎం.చెన్నయ్య, ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ శైలజ, రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ వి.రాజకుమారి, తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యాస రచన పోటీదరులకు బహుమతుల ప్రదానం

విస్సన్నపేట : విస్సన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని జై భీమ్ క్షేత్రం అధ్యక్షుడు రావణబ్రహ్మ, స్కూల్ పిల్లలకు అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి పిల్లల్లో అవగాహనకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు అందించారు.

బహుమతులు ప్రదానం

రెడ్డిగూడెం : భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా "ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ" ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు ప్రముఖ తెలుగు అధ్యాపకులు ముంగా జయరాజు, చాట్ల విజయ్ కుమార్ బహుమతులు అందించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయం, కస్తూరిబా గాంధీ విద్యాలయం విద్యార్థులకు ఈ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబిత, శ్యామల,ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి సిహెచ్ హన్న, గౌరవ సలహాదారుడు ప్రత్తిపాటి పాల్‌ఇమ్మానుయేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్డిగూడెం మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. **కంచికచర్ల :** ఎన్టీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేద్కర్ చిత్ర పటానికి పలూవురు పూలమాల వేసి నివాలులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డిబేట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మి కుమారి విజేతలకు బహుమతులందచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.